మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దినపత్రికకు
తెలంగాణ రాష్ట్రం లోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :309 ఎడిటర్: గొడిశాల సోమయ్య బుధవారం 09-04-2025 పేజీలు :8 వెల : 3 రూ

## పవన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ..



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నాడు. సింగపూర్ స్కూల్‌లో చదువుకుంటున్న పవన్ కల్యాన్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌కి స్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ చేతులు, కాళ్ళకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో ఇబ్బందులకు గురయ్యాడు. మార్క్ శంకర్‌ను స్కూల్ సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాద ఘటనపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరా తీశారు. పవన్ కల్యాణ్‌కు ఫోన్ చేసిన ప్రదాని మోదీ, మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ 2లో

## ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి!




ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారునికి జరిగిన ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. పవన్ కుమారుడికి గాయాలు కావడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ చదువుతున్న పాఠశాలలో ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పవన్ కొడుకు శంకర్ సహా పలువురు చిన్నారులు గాయపడ్డారు. అప్రమత్తమైన స్కూల్ సిబ్బంది వారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం పవన్ కుమారుడు శంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు తన "%శ%" ఖాతాలో పోస్ట్ చేశారు.అయితే మన్యం జిల్లా పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ కాసేపటి క్రితమే పర్యటన ముంగించుకొని వైజాగ్ చేరుకున్నారు. కాసేపట్లో ఆయన సింగపూర్ వెళ్లనున్నారు. పవన్ కల్యాణ్ తో పాటు చిరంజీవి దంపతులు కూడా వెళ్లనున్నారు.

# వక్ఫ్ చట్టం అమలు




న్యూఢిల్లీ: పార్లమెంటులో గత వారం ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం ఈరోజు (ఏప్రిల్ 8) నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారంనాడు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. తక్షణం ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. గత వారంలో పార్లమెంటు ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు-2025పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 5న సంతకం చేశారు. దాంతో వక్ఫ్ బిల్లు చట్టరూపం దాల్చింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో, రాజ్యసభల్లో చర్చ అనంతరం ఏప్రిల్ 4న ఓటింగ్ జరగడంతో రెండు సభల్లోనూ బిల్లు నెగ్గింది. లోక్‌సభలో 288-232, రాజ్యసభలో 128-95 ఓట్ల తేడాతో బిల్లు గట్టెక్కింది.

## రిజిస్ట్రేషన్.. ఇక మరింత సులువు..




రిజిస్ట్రేషన్.. ఇక మరింత సులువు కాబోతుంది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం ఇక ఉండదు. ఇందుకోసమే సులువైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం(ఏప్రిల్ 8) విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురాబోతున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. మొదటగా హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లా రామగుండం, ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం (%=.ా%), మేడ్చల్ (%=.ా%), మహబూబ్ నగర్(%=.ా%), జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, 2లో

## ఆదే నా సవాల్ సిద్ధమా..?



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ కలిసే తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పలు కేసుల్లో కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతుందే రేవంత్ రెడ్డి అని అన్నారు. వారిద్దరూ మంచి దోస్తులని, అందుకే చెన్నై డీలిమిటేషన్ మీటింగ్‌కు కలిసే వెళ్లారని చెప్పుకొచ్చారు. త్వరలో డీలిమిటేషన్‌పై హైదరాబాద్‌లో జరగబోయే మీటింగ్‌ను సైతం ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. అలాగే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీలతో పార్లమెంట్‌లో ఓటు వేయించారని మండిపడ్డారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ మజ్లిస్ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ తమ 2లో

## కేటీఆర్ షాకింగ్ కామంట్స్

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (%ఖు=%) హాట్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కాపాడుతుందే బీజేపీ నాయకత్వమని ఆరోపించారు. దేశంలో అత్యంత పవర్ ఫుల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని తెలిపారు. ఇవాళ(మంగళవారం) బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడిగా బలపర్చిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి 2లో



## ఆ టీచర్లకు న్యాయం చేయండి...



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో 2016లో నిర్వహించిన టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈనెల 3న సుప్రీంకోర్టు సమర్థించడంతో 25,000 మందికి పైగా టీచర్లు, సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ విషయంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని లోక్‌సభలో విపక్ష నేత 2లో

# పవన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ..

తెలిపారు.
సింగపూర్ కాలమానం ప్రకారం ఈ ఉదయం 9:45 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. 'రివర్ వ్యాలీ రోడ్ షాప్ హౌస్' బిల్డింగ్‌లో మంటలు చెలరేగాయి. అదే భవనంలోని స్కూల్‌లో మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో15-19 మంది విద్యార్థులు గాయపడగా, ఒకరు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. మార్క్ శంకర్‌కు ప్రాణహాని లేకుండా కాపాడిన సిబ్బందికి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రమాదంపై సింగపూర్ డిఫెన్స్ ఫోర్స్ దర్యాప్తు చేస్తోంది. మరోవైపు పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని జనసేన కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

# ఆదే నా సవాల్ సిద్ధమా..?

పార్టీ అభ్యర్థులను బరిలోకి దించలేదని ఆరోపణలు గుప్పించారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మాత్రం మారలేదని ఆగ్రహించారు. ఇద్దరూ ఏకమై బీజేపీని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని బండి సంజయ్ మండిపడ్డారు.

# కేటీఆర్ షాకింగ్ కామెంట్స్

రేవంత్‌రెడ్డి అని చెప్పారు. రాజకీయ బాంబులు పేలకపోవటంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైలెంట్ అయ్యారని విమర్శించారు. అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందని బీజేఎల్పీ లీడర్ మహేశ్వరరెడ్డి కూడా అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు.రేవంత్, రాహుల్ (ఆర్ఆర్) టాక్స్ అని స్వయంగా ప్రధాని మోదీ అన్నారని... కానీ యాక్షన్ ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ కోసం తామెందుకు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటామని అన్నారు. హైదరాబాద్ పరిధిలో పోటీకి తమకు సరిపడా నంబర్ లేదని చెప్పారు. ఎన్నికల్లో పోటీపై తమ విధానం తమకు ఉంటుందని అన్నారు. ఎల్పీజీ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అంత ఉలికిపాటు ఎందుకని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

# ఆ టీచర్లకు న్యాయం చేయండి...

రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి ఆయన లేఖ రాశారు. సక్రమమైన రీతిలో ఎంపికైన టీచర్లను విధుల్లో కొనసాగేలా చూడాలని, వారికి న్యాయం చేయాలని రాష్ట్రపతిని కోరారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ రద్దు చేయడంతో వేలాది మంది అర్హులైన టీచర్లు ఉపాధి కోల్పోయినట్టు శిక్షక్ శిక్షకా అధికార్ మంచ్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చారని, రాష్ట్రపతి జోక్యం కోరుతూ లేఖ రాయాల్సిందిగా తనకు విజ్ఞప్తి చేశారని రాహుల్ ఆ లేఖలో పేర్కొన్నారు. మంచ్ ప్రతినిధుల విజ్ఞాపన పత్రం ప్రతిని కూడా రాహుల్ రాష్ట్రపతికి రాసిన లేఖకు జత చేశారు.టీచర్ల నియామక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని గుర్తిస్తూ నియామక ప్రక్రియ చెల్లదని కోల్‌కతా హైకోర్టు తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఏప్రిల్ 3న సమర్థించింది. దీంతో టీచర్లు, సిబ్బంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తోంది. వారి ఆశలన్నీ అడియాశలయ్యే దశలో ఉన్నారు" అని రాహుల్ పేర్కొన్నారు. కొందరు అభ్యర్థులు సహజ ప్రక్రియలో ఎంపికయ్యారని, మరి కొందరు అనుచిత మార్గాల ద్వారా ఎంపికయ్యారని రెండు తీర్పుల్లోనూ (హైకోర్టు, సుప్రీంకోర్టు) ఉందని, అయితే రిక్రూట్‌మెంట్ ప్రక్రియతో కళంకితులతో పాటు, నిష్కళంకితులు కూడా ఉద్యోగాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. రిక్రూట్‌మెంట్‌లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఖండించాల్సిందేనని, ఇందుకు పాల్పడిన వారికి శిక్షించాలని, అయితే సక్రమ రీతిలో ఎన్నికైన టీచర్లను సైతం కళంకిత టీచర్లతో సమానంగా శిక్షించడం తీవ్ర అన్యాయం చేయడం అవుతుందని రాహుల్ ఆ లేఖలో రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. కళంకిత టీచర్లు సైతం సుమారు పదేళ్లుగా సేవలందిస్తున్నారని రాహుల్ గుర్తు చేశారు. టీచర్లందిరినీ ఉద్యోగాల నుంచి తొలగించడం వల్ల లక్షలాది మంది పాఠశాలల్లో విద్యార్థులకు చదువు చెప్పే వాళ్లు లేకుండా పోతారని, పిల్లల భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు ఇది శరాఘాతం అవుతుందని తెలిపారు. "మేడమ్... మీరు గతంలో టీచర్‌గా కూడా పనిచేశారు. టీచర్లు, వారి కుటుంబాలు, విద్యార్థుల కష్టాలు మీకు తెలియనివి కావు. వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో సరైన రీతిలో ఎంపికైన వారిని విధుల్లో కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని మిమ్మల్ని కోరుతున్నాను" అని రాష్ట్రపతికి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు.

# ఐజేయూతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం

ధర్మసాగర్ ఏప్రిల్ 8 నమస్తే హైదరాబాద్ హనుమకొండ జిల్లా ధర్మసాగర్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయుతోనే జర్నలిస్ట్ సమస్యలు పరిష్కారం అవుతాయని యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొట్టే లెనిన్ సుధాకర్ అన్నారు ధర్మసాగర్ మండల కేంద్రంలో మంగళవారం టి యు డబ్ల్యూ జే ఐ జేయు సభ్యత్వం హనుమకొండ జిల్లా యూనియన్ ఈసీ మెంబర్ అంబాటి విష్ణువర్ధన్ రాజు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుధాకర్ లెనిన్ మాట్లాడుతూ. జర్నలిస్టుల సమస్యలు ఐజేయుతోనే పరిష్కారం అవుతాయని ప్రతి ఒక్క జర్నలిస్ట్ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు



# రిజిస్ట్రేషన్.. ఇక మరింత సులువు..

నాగర్ కర్నూల్ మొత్తం 22 చోట్ల ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.
సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వలన జరిగే జాప్యాన్ని నివారించడానికి ఈ విధానం తీసుకువచ్చినట్లు తెలిపార. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించడం జరిగిందన్నారు. ప్రజలు నేరుగా "%తీవస్త్రఅర్‌తీఫ్‌అశీతీ.వశ్రీఖఅస్త్రుఖఅ.స్త్రశీజ.ఱఅ%" వెబ్-సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్ధేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చన్నారు.
స్లాట్ బుక్ చేసుకోనివారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి, 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లతోపాటు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. దీంతో కుత్బుల్లాపూర్ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు.
స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేయడం జరిగిందని తెలిపారు.రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యూల్ ని ప్రవేశపెట్టామని మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుందని, ఇది కూడా ఐచ్ఛికమేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజు పైన అమ్మినవాళ్ళు, కొన్నవాళ్లు, సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా/భౌతికంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వలన దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీని వలన ప్రజల సమయం వృధా అవడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని ఏప్రిల్ నెల చివరిలోగా అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మా ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు ప్రజల నుండి ఎక్కువగా వస్తున్నాయి. డబుల్ రిజిస్ట్రేషన్ లను నివారించడానికి చట్టాన్ని సవరించబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలను సవరించుకున్నాయని, అదేవిధంగా తెలంగాణలో కూడా చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

## ఇందిరా క్రాంతి పథకం, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే

సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి (నమస్తే హైదరాబాద్ ప్రతినిధి): తిరుమలగిరి మండల పరిధిలో మాలిపురం, వెలిశాల, కొక్య నాయక్ తండా గ్రామలలో మెప్మా, ఐ కె పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతు రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని తెలిపారు. పండిన ప్రతి గింజల్లో రైతుల చెమట చుక్కలు ఉంటాయని గుర్తు చేసి, దళారుల చేతులో రైతులు మోసపోవద్దని సూచించినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్, ఎమ్మార్వో హరి ప్రసాద్, ఏపీఎం మధుసూదన్,మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్ నాయక్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, మార్కెట్ డైరెక్టర్ చెరకు వేణు



రావు, ఐదవ వార్డు ఇన్చార్జి సుధాకర్, రాము గౌడ్, పి ఎ సి ఎస్ డైరెక్టర్ కిష్టు నాయక్, తిరుమణి యాదగిరి, వీరు నాయక్, సుధాకర్ నాయక్, దుప్పటి మల్లయ్య, కుంబ్బం సతీష్ గౌడ్, నాయిని కృష్ణ, దుప్పల్లి అబ్బాస్, మహిళా సంఘాల అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్



నాగారం నమస్తే హైదరాబాద్: (ఏప్రిల్ 8 )రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పస్తాల,ఫణిగిరి,మామిడిపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజలో రైతు చెమట చుక్కలు ఉన్నాయని అన్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుచేతుల్లో పోసి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఆవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.ప్రతి పేదింటి బిడ్డకు నాణ్యమైన సన్నబియ్యంతో కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్నబియాన్ని అందించడం ద్వారా ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపేట వేసిందని అన్నారు. కాశితండా నుండి గుండేపూరి వరకు రోడ్డు సాంక్షన్ చేపించానని త్వరలో పనులు ప్రారంభమవుతాయి అని అన్నారు. రైతు కళ్లల్లో ఆనందాన్ని చూడాలని ఉద్దేశంతో రుణమాఫీ రైతు భరోసా పథకాన్ని తీసుకొచ్చి రైతులకు ఎంతో మేలు చేసిందని అన్నారు. నిరుద్యోగులైన యువతకు సొంత కాళ్ళమీద మీద నిలబడే అవకాశాన్ని కల్పిస్తూ రాజీవ్ యువవికాసం అనే పథకం తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య,కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, సుంకరి జనార్ధన్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్,నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడుసు లింగయ్య, తిరుమలగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేష్,జై బాపు జై భీమ్ జై సమ్మిదాన్ నాగారం మండల కోఆర్డినేటర్ పానుగంటి నరసింహారెడ్డి, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ వలి,పిఎసిఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర రావు, పిఎసిఎస్ డైరెక్టర్లు, ఎల్మకంటి సోమన్న,మండల నాయకులు ఆయా గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, తాసిల్దార్ బ్రహ్మయ్య,ఎంపిడిఓ కే మారయ్య, ఏపీఎం శోభారాణి,ఆర్ఐ, సిసి, ఏఈఓ లు పంచాయతీ కార్యదర్శులు ఐకెపి సెంటర్ల నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# విక్రమ్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మందుల సామెల్



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఏప్రిల్ 8: ఇటీవల అనారోగ్యంతో మరణించిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంపటి మాజీ సర్పంచ్ దాయం విక్రమ్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మందుల సామెల్ మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.మండల పరిధిలోని వెంపటి గ్రామంలో విక్రమ్ రెడ్డి నివాసానికి వెళ్లి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కూతురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి ని ఆమే కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్,తిరుమలగిరి మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, జిల్లా నాయకులు సుంకరీ జనార్ధన్, పసుల అశోక్ యాదవ్, పేరాల వీరేష్, జుమ్మిలాల్, భాష బోయిన వెంకన్న తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి - పానుగంటి నరసింహారెడ్డి



నాగారం నమస్తే హైదరాబాద్: (ఏప్రిల్ 8 )
రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నాగారం మండల కోఆర్డినేటర్ పానుగంటి నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మండలం పస్తాల గ్రామంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ ఆదేశాల మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడుసు లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పస్తాల గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని ప్రారంభించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతోందని, రాజ్యాంగం ద్వార సంక్రమించిన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, జిల్లా నాయకులు జాజుల వీరయ్య, జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షులు అలకుంట్ల బాలకృష్ణ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొండ మల్లేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండెం అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి వెంకట్ రెడ్డి, యలమకంటి సోమయ్య పస్తాల గ్రామ శాఖ అధ్యక్షులు బండ గొర్ల కుమారస్వామి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ వలి, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్,మండల ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కన్నెబోయిన నాగరాజు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి పోగుల విక్రమ్, కొమ్ము నరేష్, షేక్ అక్బర్ పషా, షేక్ అక్బర్, భయం వెంకన్న, ఆకుల శ్రీను,మధర్ చిప్పలపల్లి ఉపేందర్, దున్నపోతుల చంద్రశేఖర్, చిప్పలపల్లి శ్రీకాంత్, పస్తాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకురాలు అనుబంధ సంఘాల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విడుదలకు సిద్ధమైన డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ "ఫ్రైడే"





నాగారం నమస్తే హైదరాబాద్: (ఏప్రిల్ 8) దీయరాజ్, ఇనయసుల్తానా, రిహానా, వికాస్ వశిష్ట, రోహిత్ బొడ్డపాటి హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా "ఫ్రై డే". శ్రీ గణేష్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ సినిమాను డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ఈశ్వర్ బాబు ధూళి పూడి రూపొందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సాంగ్స్ రికార్డింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే "ఫ్రై డే" సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. "ఫ్రై డే" సినిమా కొత్త పోస్టర్ ఇంట్రెస్టింగ్ గా ఉండి అందరిని ఆకట్టుకుంటోంది. ఈసందర్భంగా నిర్మాత కేసనకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ కథతో "ఫ్రై డే" చిత్రాన్ని నిర్మిస్తున్నామని,ప్రేక్షకుల్ని ఆద్యంతం ఆకట్టుకునేలా మా దర్శకుడు ఈశ్వర్ బాబు ధూళిపూడి సినిమాను రూపొందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే "ఫ్రైడే" చిత్రాన్ని గ్రాండ్ గా థియేటర్ లో విడుదల చేసి మీ ముందుకు తీసుకొస్తామని అందుకు మీ అందరి సపోర్ట్ మా సినిమాకు ఉండాలని కోరుకుంటున్నాం అన్నారు. స్నిగ్ధ నయని, నవీన్,కోగంటి కార్తిక్,కోగంటి చంద్రకళ,బలగం సంజయ్, సుమన్, ప్రగతి, కోటేశ్వనవ, శుభోదయం రాజశేఖర్, ప్రభు, జిమ్ క్యారీ మహేశ్, ఆర్ కె నాయుడు తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారని తెలిపారు.

# డాక్టరేట్ పట్టా సాధించిన కొట్టే అర్పిత





నమస్తే హైదరాబాద్, (ధర్మసాగర్): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కొట్టే ప్రభాకర్ కూతురు కొట్టే అర్పిత ధర్మసాగర్ ప్రభుత్వ పాఠశాల లో చదువుకొని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యను అభ్యసించి పి హెచ్ డి పట్టపొందారు.ధర్మసాగర్ ఎస్సీ కాలనీ కి చెందిన డాక్టర్. అర్పిత కొట్టే భర్త కరుణాకర్ సంగాల, హైదరాబాదు లోని ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యనభ్యసించి పట్టుదలతో పి హెచ్ డి పట్టాను పొందారు. ప్రస్తుతం అర్పిత హైద్రాబాద్ లో సాఫ్ట్వేర్ రంగంలో విధులు నిర్వహిస్తున్నారు. "డెవలపింగ్ రోబస్ట్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ప్రిసైస్ బ్రెయిన్ ట్యూమర్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూసింగ్ ఎం ఆర్ ఐ డేటా ", అనే అంశం పై పరిశోధన చేశారు. చిన్నపటి నుండి ఏదైన సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదవడం ద్వారానే నేడు డాక్టరేట్ అవ్వడం సంతోషంగా ఉందని అర్పిత చెప్పారు. పేద కుటుంబంలో పుట్టి కి పి హెచ్ డి సాధించడంతో గ్రామస్తులు బంధువులు అర్పిత కు శుభాకాంక్షలు తెలిపారు.

# సర్కారు బడి పిలుస్తోంది రా కదలిరా




సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి (నమస్తే హైదరాబాద్ ప్రతినిధి) :
సర్కార్ బడి పిలుస్తుంది రా కదలిరా అంటూ తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులుఅన్ని సౌకర్యాలు ఉన్న విశాలమైన తరగతి గదులు ఆట స్థలం గ్రంథాలయం సైన్స్ ప్రయోగశాల కలిగి, ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు రెండు జతల దుస్తులు అందిస్తూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పైసా ఖర్చు లేని నాణ్యమైన విద్యను పొందాలని ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాసులు అన్నారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# హోంగార్డ్ సింహాచలం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి చేసిన ఎమ్మెల్యే గాంధీ

నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న మియపూర్ పోలీస్ స్టేషన్ లో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తున్న సింహాచలం మృతి పట్ల ఎమ్మెల్యే గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సోమవారం రాత్రి మియపూర్ మెట్రో స్టేషన్ 600 పిల్లర్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసులపై వేగంగా దూసుకువచ్చిన లారీ వలన అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ సింహాచలం మృతి చెందడం చాలా బాధకరమైన విషయమని అన్నారు. , వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని , వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున సహాయం అందేలా తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. అదేవిధంగా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ వికేందేర్,రాజవర్ధన్ లు కూడా త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే గాంధీ ఆకాంక్షించారు.

# పీస్ మీటింగ్ నిర్వహించిన ఎస్ హెచ్ ఓ పరశురాం



ఘట్కేసర్ ఏప్రిల్ 8 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ ఏప్రిల్ 12న హనుమాన్ జయంతి సందర్భంగా పీస్ మీటింగ్ నిర్వహించిన ఎస్ హెచ్ ఓ పరుశు రాం. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, సిక్కు పెద్దలు, క్రిస్టియన్ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# బెట్టింగ్‌లకుపాల్పడినా...

## ప్రోత్సహించినా.. కఠినంగా వ్యవహరిస్తాం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




నమస్తే హైదరాబాద్ : :ఎవరైన క్రికెట్ ఇతరాత్ర బెట్టింగ్‌లకు పాల్పడిన ప్రోత్సహించిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువత బెట్టింగ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన చేస్తూ ఇటీవల కాలంగా రాష్ట్రంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత అధికంగా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడిలో వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పుల పాల్కె ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి సాధించడంతో ప్రతి ఒక్కరికి ఇంటర్ అందుబాటులోకి రావడంతో పాటు,సోషల్ మీడియా సైతం యువతకు మరింత చేరువ అయింది.తద్వారా మోసగాళ్ళ మోసపూరితమైన ప్రకటనలు,సందేశాలకు యువత ఆకర్షితుల్కె సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా ఆన్‌ల్కెన్ బెట్టింగ్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ పాటు, ఇతరత్రా బెట్టింగ్‌ల వైపు యువత తొంగిచూడమే కాకుండా ఇంటి సభ్యులకు తెలియకుండా వీటిల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా పూర్తిగా నష్టపోవడంతో పాటు కొన్ని సందర్భాల్లో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.ఈ బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందని,ముఖ్యంగా ప్రస్తుతం దేశంలో ఐపిల్ సిజన్ ప్రారంభం అయింది.ఇది దృష్టిలో వుంచుకోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా వారు క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అయ్యే సమయాల్లో వారి ప్రవర్తతో పాటు,వారు సెల్‌ఫోన్లలో మాట్లాడే సంభాషణపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు.అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకుగాను పెద్దఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని,ఇందుకోసం ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు,టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలను వినియోగించుకోవడం జరుగుతోందని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ సిజన్ ప్రారంభమయ్యే నాటి నుండి ఇప్పటి వరకు మొత్తం నాలుగు నాలుగు కేసుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేయడంతో వీరి బ్యాంక్ ఖాతాల్లో సూమారు 42లక్షల 68వేల మూడు వందల రూపాయల వరకు లావాదేవీలు జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రధానంగా క్రికెట్ బెట్టింగ్ వ్యవహరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు తొలిసారిగా క్రికెట్ బెట్టింగ్ బుకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన వీరమణికుమార్‌ను అరెస్టు చేయడం జరిగింది.ఈ నిందితుడి బ్యాంక్ ఖాతాల్లో సుమారు మూడున్నర కోట్ల రూపాయల సంబంధించిన లావాదేవీలు జరిగినట్లుగా పోలీసులు గుర్తించడం జరిగిందని,ఇకపై ఎవరైన బెట్టింగ్‌లను పాల్పడిన,పోత్సహించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎవరైన బెట్టింగ్‌లకు పాల్పడినట్లుగా సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసు కమిషనర్ వెల్లడించారు.

# ఘనంగా ఎంపిపిఎస్ పాఠశాల వార్షికోత్సవం.....

నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : నాణ్యమైన విద్యతో పాటు సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోగల మసీద్బండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం వారి బృందం కార్పొరేటర్ గారిని శాలువా కప్పి షీల్డ్ బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... తన డివిజన్ లోగల సురభి కాలనీలోని చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థుల భవిష్యత్తు కొరకు ఆనాడు స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్పర్సన్ శ్రీమతి అండ్ శ్రీ రాగం సుజాత నాగేందర్ యాదవ్ గార్ల సొంత ఖర్చులతో నిర్మించబడిన ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతమైన చదువులు చదవడానికి దోహదపడుతున్నారని చదువు పట్ల తమకున్న అపారమైన ప్రేమ, గౌరవమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బాగా పనిచేస్తున్నాయని నాణ్యమైన విద్యతో పాటు సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులలో చదువుతోపాటు క్రమశిక్షణ ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో పటిష్టంగా పనిచేస్తున్నాయని అన్నారు.



చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని అన్ని రంగాలలో రాణించాలని విద్యార్థి దశ నుండి సామాజిక స్పృహ లక్ష్యాలను అలవర్చుకోవాలని, ఇతరులకు సహాయపడే గుణమును పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల ఎంఈఓ వెంకటయ్య, సదానంద యాదవ్, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ఉమాదేవి, %ూ=ుఖ ూ% జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, మండల %ూ=ుఖ ూ% అధ్యక్షులు హనుమంతు, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, దర్గా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తాజ్ బాబు, శేర్లింగంపల్లి కాంప్లెక్స్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బల్వంత్ రెడ్డి, కొండాపూర్ పాఠశాల మాజీ హెడ్మాస్టర్ పల్లె అనంతరెడ్డి, యూసుఫ్, సురభి కాలనీ ఎంపీపీఎస్ హెచ్ఎం పాండురంగారెడ్డి, కొండాపూర్ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

## కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులు మైస సురేష్ కుమార్

నమస్తే హైదరాబాద్ : :భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులు మైస సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఏఐసీసీ,టీపీసీసీ పిలుపు మేరకు శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశానుసారం జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమ ఇంచార్జి జనగాం రమేష్ గౌడ్ పర్యవేక్షణలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైస సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ పట్టణంలోని 4,5,6 డివిజన్లలోని తాళ్లకుంట తండా,భవానికుంట తండా,నీలగిరి స్వామి తండా,డీసీ తండా,గుబ్బేడి తండా,దుబ్బ తండా,రుక్కి తండాలలో చేపట్టిన పాదయాత్రలో రాజ్యాంగం బుక్,పీఠిక,జాతీయ జెండాను చేత పట్టుకొని అంబేద్కర్ రచించిన రాజ్యాంగం యొక్క విలువలను రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలకు వివరించారు.డా:బి.ఆర్ అంబేద్కర్ నిరంతర పోరాట ఫలితమే నేటి భారత రాజ్యాంగం అని అలాంటి మహనీయున్ని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అవమానించడం సరికాదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయినవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తూల్ల రవి,పోశాల వెంకన్న,సమ్మెట సుదీర్ గౌడ్,సిలివేరు శ్రీధర్ యాదవ్,ఎండీ అన్వర్,తుమ్మల రవీందర్,భూక్యా శ్రీలత,భూక్యా భాషా,చీటూరి రాజు,భీమా నాయక్, కొండేటి బాలకృష్ణ,అంగోతు బిక్షపతి,నాను నాయక్, మాలోతు స్వామి,భూక్యా బాబూలాల్,వాంకుడోతు రాము,దుబ్బాక రాజు,విలాసారపు వెంకట్,ఎస్కే షబ్బీర్,నాంపెల్లి






యాదగిరి,మరుపట్ల సాయి, తాళ్లపెల్లి శ్రీను,నిరంజన్,తారాబాయి,మాలోతు దేవేందర్,అంగోతు లచ్చిరామ్,బానోత్ రమేష్, బానోత్ బిక్షపతి,మంగ్యా నాయక్,మైబు,డీసీతండా లక్ష్మణ్,వెంకట్రాం,తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎన్ టి ఎస్ ఓ లో శ్రీ చైతన్య విజయభేరి



నమస్తే హైదరాబాద్ : జాతీయస్థాయిలో జరిగిన ఐ ఎన్ టి ఎస్ ఓ లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారని పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన ఐ ఎన్ టి ఎస్ లో ఫలితాలలో ప్రతిభ చూపి బహుమతులు గెలుపొందారని తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ నాలుగో తరగతికి చెందిన సిహెచ్ భవితకు ఎస్ టి ఎస్ ఓ మొదటి బహుమతి ట్యాబు గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ రెండో బహుమతి 9వ తరగతికి చెందిన ఏ జాన్ పాల్ ఈ టి ఎస్ ఓ లో రెండో బహుమతి గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ మూడవ బహుమతి ఎంటి ఎస్ ఓ లో ఆరవ తరగతికి చెందిన ఎం లాస్య గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ నాలుగో బహుమతి ఏడవ తరగతి చెందిన వై సంతోష్ కుమార్ ఎం.టి.ఎస్ ఓ లో గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ మరియు ఐదవ తరగతికి చెందిన షేక్ అయాన్ ఎస్ టి ఎస్ ఓ లో గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ ఐదో బహుమతి 8వ తరగతికి చెందిన బి గ్రీష్మ ఈ టి ఎస్ ఓ లు గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ నిర్వహించిన ఐ ఎన్ టి ఎస్ ఓ లో మొత్తం 78 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఇందులో హై స్కూల్ విద్యార్థులు 33 మంది ప్రైమరీ విద్యార్థులు 45 మంది హై స్కూల్ విద్యార్థులు ఎంటిఎస్ఓలో 13 మంది ఎస్టి ఎస్ ఓ లో 8 మంది జి టీ ఎస్ ఓ లో4 మంది ఈ టి ఎస్ ఓలో 8 మంది ప్రైమరీ విద్యార్థులు ఎంటి ఎస్ఓలో 19మంది ఎస్టిఎస్ ఓలో 5 మంది టీఎస్ఓ లో 5 మందిఈ వి ఎస్ ఓ లో 16 మంది కన్సోలేషన్ బహుమతి గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య డీజిఎం సుధాకర్, ఆర్ ఐ సుజిత, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు హైస్కూల్ డీన్ విజయకృష్ణ హై స్కూల్ ఒలంపియాడ్ ఇంచార్జ్ ఎస్ నరేష్ చారి ప్రైమరీ ఒలంపియాడ్ ఇన్చార్జ్ కె.నలిని ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# పల్లా,రాజయ్యలు సాక్ష్యాధారాలతో నిరూపిస్తే వాళ్ళ ఇళ్లల్లో గులాంగా పని చేస్తా

- నిరూపించలేకపోతే వాళ్ళు నా ఇంట్లో గులాంగా పని చేయాలి
- వాళ్ళ ఒంట్లో చీము నెత్తురు ఉంటే నా సవాల్ ను స్వీకరించాలి
- గుంట భూమి కబ్జాకు పాల్పడినట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- నాపై చేస్తున్న భూ ఆక్రమణ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్న
- ఆధారాలు లేకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ దిన పత్రిక,టీవీ ఛానల్
- పత్రికా విలువలకు తిలోదాకలు ఇస్తూ ఒక వ్యక్తి నిజాయి తీని, ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కథనాలు ప్రచురించడం సరైంది కాదు
- నిజా నిజాలు తెలుసుకోకుండా నాపై దుష్ప్రచారం చేయడం బాధాకరం
- నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటా
- ఫారెస్ట్ భూములను కాపాడుతా.... పట్టా భూములు కలిగిన రైతులకు న్యాయం చేస్తా
- దేవునూరు గుట్టలను ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తా

మాజీ ఉప ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నమస్తే హైదరాబాద్ : :ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నాపై చేస్తున్న భూ కబ్జా ఆరోపణలను సాక్ష్యాదారాలతో నిరూపిస్తే వాళ్ళ ఇళ్లల్లో గులాంగా పని చేస్తానని,నిరూపించలేకపోతే వాళ్ళు నా ఇంట్లో గులాంగా పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. మీలో నిజంగా తెలంగాణ పౌరుషం ఉంటే,మీ ఒంట్లో చీము,నెత్తురు ఉంటే నా సవాల్ ను స్వీకరించాలని డిమాండ్ చేశారు.హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ లతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత మూడు,నాలుగు రోజులుగా బిఆర్ఎస్ పార్టీ దిన పత్రికలో,టీవీ ఛానల్ లో వచ్చిన వార్త కథనాలు,సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారం,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేసిన అటవీ భూముల ఆక్రమణ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ధర్మసాగర్ మండలం దేవునూర్,ముప్పారం,నారాయణగి గ్రామాలకు చెందిన రైతులు నన్ను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరారు.పట్టా భూములను అటవీ శాఖ ఆక్రమణపై రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ ను కలిసి రెవెన్యూ,ఫారెస్ట్ శాఖలతో జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ధారించి రైతులకు న్యాయం చేయాలని కోరడం జరిగిందని అన్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ,ఫారెస్ట్ శాఖ వారు జాయింట్ సర్వే నిర్వహించారు. జాయింట్ సర్వే రిపోర్ట్ లో 23మంది రైతులకు సంబందించిన 43.38 ఎకరాల భూమి పట్టా భూమి ఉంది అని తేలింది.అటవీ శాఖ డ్రాఫ్ట్ లో లేని ఈ భూమి పట్టా భూమి అని నిర్ధారించారు.ఈ 23మంది రైతులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పట్టా పాస్ బుక్ లు,తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి ద్వారా జారీ చేసిన పట్టా పాస్ బుక్ లు కూడా ఇచ్చారని,2017 నుండి ఈ 23 మంది రైతులకు రైతు బందు ద్వారా ఆర్థిక సహాయం కూడా అందుతున్నట్లు వెల్లడించారు.అటవీ శాఖ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రపోజల్ ప్రకారం 3 వేల 750 ఎకరాలు ఉండాల్సిన అటవీ భూమికి జాయింట్ సర్వే రిపోర్ట్ ప్రకారం 3 వేల 955 ఎకరాలు అటవీ శాఖ అధీనంలో ఉంది.దీనిని బట్టి రైతుల పట్టా భూములను కూడా అటవీ శాఖ తమ ఆదీనంలో పెట్టుకొని ఇవి కూడా అటవీ భూములే అని బుకాయిస్తోంది.రైతులు వారి పట్టా భూములలో పంటలు వేసుకుంటే పంటలకు నష్టం కలిగించడమే కాకుండా హద్దులను చేరిపేస్తున్నారని, పట్టాదారులైన రైతుల పైన కేసులు పెడుతున్నట్లు తెలిపారు.న్యాయ పరంగా,చట్ట పరంగా హక్కులు కలిగిన రైతుల పక్షాన నేను మాట్లాడుతున్నాని వాళ్ళ ప్రతినిధిగా రైతులకు న్యాయం చేయాలన్నదే నా ప్రయత్నమని తెలిపారు.30 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఒక గుంట భూమి కూడా కబ్జాకు పాల్పడలేదని ఈ రోజు వరకు కూడా ఒక ఆరోపణ లేదు,ఒక పోలీస్ కేసు లేదని స్పష్టం చేశారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేని వారు నాపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు.పల్లా రాజేశ్వర్ రెడ్డి,రాజయ్య ఇద్దరు అక్కడికి వెళ్లి ఫారెస్ట్,రెవెన్యూ అధికారులు, రైతులు,ప్రజలతో కలిసి మీడియా ముందే వాస్తవాలను ప్రజలకు తెలియజేసిన నేను సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. దేవునూర్ అటవీ భూములలో ఒక గుంట భూమి కబ్జాకు పాల్పడిన నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్తానని స్పష్టం చేశారు. పట్టాదారులైన రైతులకు న్యాయం చేయడంతో పాటు అటవీ భూములను కాపాడాల్సిన బాధ్యత నాపై ఉందని అన్నారు.అటవీ భూములను పరిరక్షించడానికి దేవునూరు గుట్టలను ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు.త్వరలోనే కుడా ఆధ్వర్యంలో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధం చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.పట్టా భూములు కలిగిన రైతులకు అన్యాయం జరగకుండా చూసుకోవడంతో పాటు అటవీ భూమిని కాపాడుతానని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల స్థాయి నాయకులు,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో బలమైన మార్పు సాధ్యం

- సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చు
- కలలు కనండి... కలలను సాకారం చేసుకోండి
- ప్రముఖ సామాజిక వేత్త,సీ.ఎస్.సీ కోర్టు హైదరాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి
- శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ





నమస్తే హైదరాబాద్ : విద్య ద్వారానే వ్యక్తి,సమాజం,కుటుంబంలో బలమైన మార్పు సాధ్యం అవుతుందని ప్రముఖ సామాజిక వేత్త,సీ.ఎస్.సీ కోర్టు హైదరాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి తెలిపారు.పొట్టి శ్రీరాములు జిల్లా కావలి పట్నంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని సింగిల్ పేరెంట్స్ ఉన్న వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నూతన దుస్తులు, కుట్టు శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంస పత్రాలు పంపిణీ కార్యక్రమానికి ప్రముఖ సామాజిక వేత్త,సీ.ఎస్.సీ కోర్టు హైదరాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంజనీ కుమారి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు అయిన శ్రీనివాసు రమాదేవి దంపతుల కుమార్తె జ్యోతిర్మయి పుట్టినరోజు సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన దుస్తులు, కుట్టు శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంస పత్రాలు అందజేయడం అభినందనీయం అన్నారు.ప్రవాస భారతీయులైన శ్రీనివాస్,వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా వారి కుమార్తె కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అదేవిదంగా జ్యోతిర్మయి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మనకు తల్లిదండ్రులు ఉన్నారా లేదా అనేది పక్కనపెట్టి మనకు ఈరోజు అన్ని విషయాలలో సహాయ సహకారాలు అందిస్తున్నారంటే దానికి కారణం చదువు అని, మనల్ని ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థితికి చేరడానికి మన ముందున్న చదువు ఒక్కటే మార్గం అని,చదువును ఎవరు దొంగిలించరు,మన నుండి విడదీయరు,మన జీవిత దశ దిశ నిర్దేశించేది చదువు అని సూచించారు.మీరందరూ బాగా చదువుతున్నందున నేడు జ్యోతిర్మయి పుట్టినరోజు సందర్భంగా మీకు నూతన దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.మీకు అటు స్కూల్ నుండి కావచ్చు సమాజం నుండి కావచ్చు కొంత సహాయ సహకారాలు అందుతున్నాయంటే దానికి కారణం చదువు అని,ఈరోజు ప్రవాస భారతీయుడైన శ్రీనివాస్ ఒక ఉన్నతమైన స్థితిలో ఉన్నారు,అంటే ఆయన ఆనాడు చదువుకున్న చదువు శ్రీనివాస్ కుటుంబాన్ని ఒక ఉన్నతమైన స్థితిలో ఉంచడమే కాక ఆయన్ని ఒక ప్రవాస భారతీయుడు అని పిలిచే విధంగా ఆయన జీవితం కొనసాగుతుందని,ఆయన మీ అందరికీ ఒక స్ఫూర్తి దాత, మీరు ఎవరైనా రోల్ మోడల్ తీసుకోనక్కర్లేదు ఒక్క శ్రీనివాస్ మీ రోల్ మోడల్ గా మీరు తీసుకొని ఉన్నతమైన మీ ఆశయాలను నెరవేర్చుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ మాధవి అనేక సేవా కార్యక్రమాలు ఈ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నారని చదువుతోపాటు మీరు టైలరింగ్,ఎంబ్రాయిడింగ్, డ్రాయింగ్,ఆర్ట్ లో కూడా మీ ప్రతిభని చాటగలరని భావిస్తున్నానని,ఎక్కడో కెనడా ఎక్కడో అమెరికాలో భారతీయులు ఉంటూ జన్మభూమి అన్న నేలని మరవకుండా వారు ఇలా సహాయం చేయడం అనేది చాలా గొప్ప విషయమన్నారు.ఈరోజుల్లో ఎంత సంపాదిస్తే అంత గొప్ప అనుకునే వాళ్ళు కుప్పలు కుప్పలుగా ఉన్నా,మన భారతీయులు ఎక్కడ ఉన్నా మనమంతా ఒక్కటే అని చాటి చెప్పడం కాక సంపాదించిన దానిలో ఎంతోకొంత మనం చదువులో,అలాగే అందిపుచ్చుకున్న అవకాశాలలో వెనకబడిన వారికి కొంత సహాయం చేయాలనే సంకల్పం ప్రవాస భారతీయులలో రావడం దానికి మొదటగా ఈ జిల్లాలోనే తొలి వ్యక్తిగా శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులు నిలబడటం చాలా గొప్ప విషయమన్నారు.వారు శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా గొప్ప విషయమని,ట్రస్ట్ ఫౌండర్,చైర్ పర్సన్ మాధవి ప్రవాస భారతీయుల సహాయ సహకారాలు తీసుకుంటూ ముఖ్యంగా మహిళలకు అందుబాటులో ఉంటూ వారికి కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ అలాగే ఈ జిల్లాలో ఉన్న విద్యాలయాలలో విద్యార్థులకు బుక్స్,బ్యాగ్స్,స్టడీ మెటీరియల్,యూనిఫామ్,పండగల సమయంలో నూతన దుస్తులు అందజేస్తూ,వారి శిక్షణ కేంద్రం నుండే మెటీరియల్ తీసుకొని శిక్షణ పొందిన మహిళలతో కుట్టించి విద్యార్థులకు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు.మంచి మనసున్న మహారాణి మాధవి మీరందరూ మీ దగ్గరలో ఉన్న సాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు పొందాలని,దీనిలో మమ్మల్ని కూడా భాగస్వాములను చేసిన ప్రవాస భారతీయులు శ్రీనివాస్,మాధవి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.మీరు విద్యా పరంగా చేసే కార్యక్రమంలో మా వంతు సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయని స్పష్టం చేశారు.బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ ఈరోజుల్లో మనం ఉన్నతమైన స్థానాల్లో నిలదొక్కుకోవాలంటే దానికి చదువు ఒక్కటే మార్గం అని,చదువుతోపాటు ఇతర వృత్తి నైపుణ్య కోర్సులలో కూడా ప్రావీణ్యత కలిగి ఉండాలని అన్నారు.హిందీ పండిట్ నెల్లూరి వాసి కామంచి శారద మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని,అలాగే అన్నిటికంటే ముఖ్యం చదువు,ఆ చదువు మీకు ఉన్నతమైన స్థితిని కలిగిస్తుందని,చదువుతోపాటు మనకున్న కోర్సులు,కళలలో కూడా ప్రాధాన్యత సంపాదించాలని సూచించారు.అలా మీ జీవన ప్రయాణం సాగాలని,మనతో ఎవరున్నా లేకున్నా మనం నమ్ముకున్న చదువు మనల్ని ఉన్నతమైన స్థితికి తీసుకుపోతుందని,తల్లిదండ్రులు లేరని మీరు అద్దైర్యపడొద్దు,మిమ్మల్ని తీర్చి దిద్దటానికి గురువులు,అలాగే సహాయ సహకారాలు అందించడానికి ఇలా ప్రవాస భారతీయులు అయినా శ్రీనివాస్,మాధవి,అంజనీ కుమారి లాంటివాళ్ళు అండగా ఉన్నారని చెప్పారు.మీకు విద్యాపరంగా మేమందరం మీతో ఉన్నామని, మీరు చేయవలసిందల్లా సంతోషంగా ఉండటం,ఇష్టంతో చదువుకోవడం,మీకు అందుబాటులో ఉన్న కోర్సులలో చేరటం అలాగే మీకు ఇష్టమైన కళలో నైపుణ్యాన్ని ప్రదర్శించడం ప్రస్తుతం చాలా అవసరం అని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్,ఫౌండర్ మాధవి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు అయిన శ్రీనివాస్,వారి కుటుంబ సభ్యుల సహకారంతో ట్రస్ట్ నడపడం జరుగుతుందని,మున్ముందు గ్రామం నుండి జిల్లా స్థాయి వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అకాంక్షించారు.సంవత్సరం నుండి మా ట్రస్ట్ ద్వారా అనేకమంది సహకారాలతో సేవా కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రవాస భారతీయుడు శ్రీనివాస్ రమాదేవి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.వారి కుమార్తె జ్యోతిర్మయి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.ఈ సందర్భంగా జ్యోతిర్మయి కి జన్మదిన శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమం ద్వారా కుట్టు శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంస పత్రాలు,తల్లిదండ్రులు లేని, సింగల్ పేరెంట్స్ ఉన్న పిల్లలకు ఈ శిక్షణ కేంద్రం ద్వారా దుస్తులు కుట్టి పిల్లలకు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజనీ కుమారి,బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజు,హిందీ పండిట్ నెల్లూరు వాసి కామంచి శారద,మీడియా ప్రతినిధి జయ ప్రతాపరెడ్డి తోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# పాఠశాలలు,కళాశాలల బలోపేతానికి ట్వీన్నింగ్ ప్రోగ్రామ్



నమస్తే హైదరాబాద్ : :పాఠశాలలు,కళాశాలల బలోపేతానికి ట్వీన్నింగ్ ప్రోగ్రామ్ దోహపడుతుందని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.మంగళవారం పర్వతగిరి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ లో పర్వతగిరి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల యొక్క ట్విన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు,ఇదే సమయంలో మోడల్ స్కూల్ లో ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ట్వినింగ్ ప్రోగ్రాం వల్ల ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు బలోపేతం అవుతాయని,దీనికి మన మండలంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా హర్యానా, తెలంగాణ సంస్కృతి విశేషాలను తెలియపరిచారు.తదనంతరం గైడ్ టీచర్ కల్పన సారథ్యంలో విద్యార్థులు ప్రదర్శించిన హర్యానా రాష్ట్ర నృత్యం, తెలంగాణ జానపద నృత్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. హర్యానా వంటకాలను,తెలంగాణ వంటకాలను విద్యార్థులకు ప్రదర్శింపచేశారు.ట్వినింగ్ లో భాగంగా వచ్చిన విద్యార్థుల ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు,పాఠశాల పరిసరాలను ఫిజిక్స్,కెమిస్ట్రీ, జూవలాజీ లాబ్ లను అటల్ టింకరింగ్ లాబ్ ను,పాఠశాల లైబ్రరీనీ వృత్తి విద్యకు సంబంధించిన అప్పారెల్, కంప్యూటర్ లాబ్ లను చూసారు. మౌలిక వసతులను,బోధనా పద్ధతులను,పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి,మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పేద ప్రజల కడుపు నింపే పథకం సన్న బియ్యం పంపిణీ పథకం

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలకు పెద్దపీట
## సన్న బియ్యం పంపిణీ ద్వారా 3వేల కోట్ల అదనపు భారం
## పేద ప్రజల పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం
## టీపీసీసీ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల రెడ్డి




నమస్తే హైదరాబాద్ : :పేద ప్రజల కడుపు నింపే సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని నిరూపించారని టీపీసీసీ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల రెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రేషన్ కార్డుదారుల నివాసంలో టీపీసీసీ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల రెడ్డి వారితో కలిసి భోజనం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల ప్రభుత్వం అని తెలిపారు.రాష్ట్రంలో పేదవాళ్ళు,పెద్దవాళ్ళు అనే తేడా లేకుండా అందరూ ఒకే రకమైన బియ్యం తినాలి అనే ఆలోచనతో దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అభివర్ణించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తూ తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 90లక్షల రేషన్ కార్డులు ఉండగా 2కోట్ల 81లక్షల 50వేల మంది లబ్ధిదారులు ఉన్నారని,ఇప్పుడు కొత్తగా వచ్చిన దరఖాస్తుల ద్వారా మరో 10లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు కానున్నాయని మొత్తంగా 1కోటి రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి లబ్ది చేకూరనుందని తెలిపారు. మొత్తం బియ్యం పంపిణీకి 13వేల 500కోట్లు ఖర్చు అవుతుందని అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 8వేల కోట్లు అయితే కేంద్ర ప్రభుత్వ వాటా 5వేల 500కోట్లు అని తెలిపారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజలందరి ఆదరణ,ఆశీస్సులు ఉండాలని కోరారు.

# బాలలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి






నమస్తే హైదరాబాద్ : బాలలు వ్యక్తిగత శుభ్రతతో పాటు,పరిసరాల పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ కంటెం లక్షీనారాయణ సూచించారు.వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నేషనల్ వైస్ చైర్మన్, అడ్వైజర్,కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి,శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ట్రస్ట్ సహకారంతో హన్మకొండలోని,అర్బన్ డిప్రవడ్ అనాధ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల పిల్లలకు,స్వధార్ మహిళా ఆశ్రమంలోని మహిళలకు,సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కంటెం లక్షీనారాయణ వైద్య పరీక్షలు చేసి,తగిన సూచనలు చేసి మందులను అందించారు.అనంతరం డాక్టర్ లక్షీనారాయణ మాట్లాడుతూ ఆహారంలో ఆకుకూరలు,పప్పు దినుసులు,గుడ్లు తీసుకోవాలని, తగిన వెలుతురులో చదువుకోవాలని,వైద్యుల సలహాలు లేకుండా ఎటువంటి మందులు వేసుకోవద్దని అన్నారు.డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని,పిల్లలకు ఏ ఆరోగ్య సమస్యలు వచ్చినా అశ్రద్ధ చేయకుండా వైద్యుల దగ్గరకు తీసికొని వెళ్లాలని అన్నారు.వేసవి మొదలైన కారణంగా పిల్లలు ఎక్కువ నీళ్లు త్రాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహకులు శ్రీకాంత్,దీప,శైలజ,కెమిస్ట్ రవి, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# మోడీ మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

## సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం,వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి
## ఆర్ఎస్ఎస్,బిజెపి మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ,వరంగల్,హన్మకొండ కలెక్టరేట్ ముందు ధర్నా





నమస్తే హైదరాబాద్ : ఆర్ఎస్ఎస్,బిజెపి కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ, అఖిలభారత నిరసన దినంగా పాటించాలని సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జాతీయ కమిటీ పిలుపునిచ్చింది.ఈ పిలుపులో భాగంగా సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏకశిలా పార్క్ నుండి వరంగల్ కలెక్టరేట్ వరకు దేశంలో మోదీ మతోన్మాద చర్యలను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి,వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేసి డి.ఆర్.ఓ.ఎం. విజయ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు.అనంతరం హన్మకొండ కలెక్టరేట్ లో డి.ఆర్.ఓ. వైవి. జగన్ కు ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు.ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్టు విధానాలు నశించాలని,కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు రద్దు చేయాలని,నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేయాలని,నూతన విద్యా విధానాన్ని రద్దుపరచాలని,డీ లిమిటేషన్ ను వ్యతిరేకించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం, వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి లు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలందరూ అనేక సమస్యలతో సతమతమవుతుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం మత ఉన్మాద,విద్వేషాలను ప్రచారం చేస్తుందన్నారు.దేశంలో మతోన్మాద బ్రాహ్మణీయ మనువాద రాజ్య స్థాపనే ధ్యేయంగా విద్య,పారిశ్రామిక,వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు తీసుకు వస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశ కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచి పెట్టేందుకు,కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 లేబర్ చట్టాలను,4 లేబర్ కోడ్ లుగా కుదించారన్నారు.దేశంలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ కేంద్రంగా జరిగిన రైతు ఉద్యమానికి తలవంచిన మోడీ ప్రభుత్వం,
రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని తీసుకొస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించడమే కాకుండా,అవే చట్టాలను దొడ్డిదారిన అమలు చేయడానికి నూతన వ్యవసాయ ముసాయిదా పేరిట మళ్లీ తీసుకువస్తూ దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నదన్నారు.ఉన్నత చదువులు చదివిన విద్యార్థి యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ఒకే దేశం -ఒకే ఎన్నిక,డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో సైతం మత ఘర్షణలు సృష్టించేందుకు ఆర్ఎస్ఎస్,బిజెపి సంఘ పరివార్ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు.భిన్నత్వంలో ఏకత్వస్ఫూర్తికి,దేశ లౌకిక వ్యవస్థ మనుగడకు, రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు ప్రమాదకరంగా మారుతున్న ఆర్ఎస్ఎస్,బిజెపి కేంద్ర ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్టు విధానాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్, జిల్లా నాయకులు మైదం పాణి,పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, టి.యు.సి.ఐ. వరంగల్ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు,ఏ.ఐ.యు.కె.ఎస్. జిల్లా నాయకులు ధార లింగన్న,కత్తుల కొమరయ్య,సతీష్,అంకుష్,మాస్ లైన్ డివిజన్ నాయకులు బుచ్చన్న,జవహర్ లాల్, మల్లేష్,సింగనబోయిన కట్టయ్య,స్వరూప,సరోజన, సంతోష,ఇంద్ర,మరియ,కొడెం మమత,ధార రాధమ్మ,ఎర్రోళ్ల లక్ష్మమ్మ,రమ,తదితరులు పాల్గొన్నారు.

# కాళ్ళ పారాణింకా ఆరనే లేదు.. 22 రోజులకే నవ వధువు మృతి!

హాజీపూర్ మండలం టికానపల్లి గ్రామానికి చెందిన కంది కవిత, శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. చిన్న కూతురు శృతిని ఇదే మండలానికి చెందిన పెద్దంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఘర్షకుర్తి సాయికి ఇచ్చి గత మార్చి నెల16వ తేదీన ఘనంగా వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో వరకట్నం కింద 9 తులాల బంగారం, రూ .5 లక్షల కట్నకానుకలు సమర్పించారు. వివాహ సమయంలో ఒప్పుకున్న విధంగానే అబ్బాయికి అన్ని లాంచనాలు అందించి నవ వధువును మెట్టినింటికి సాగనంపారు. అయితే అంతలోనే ఏం జరిగిందో తెలియదు కానీ వారం రోజులకే కన్నీళ్లు పెట్టుకుంటూ పుట్టింటి బాట పట్టింది నవ వధువు శృతి. భర్త సాయితోపాటు అత్తా లక్ష్మి, మామ శంకరయ్య మానసికంగా ఇబ్బంది పెడుతూ పెళ్లికి అయిన ఆరు లక్షల రూపాయలు ఖర్చును పుట్టింటి నుండి తేవాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేదీలేక శృతి తల్లిదండ్రులు సోమవారం(ఏప్రిల్ 7) రాత్రి 50 వేల రూపాయలు సాయికి అందజేశారు. మిగతా సొమ్మును తొందరలోనే ముట్టచెపుతామని నచ్చజెప్పి శృతి తల్లిదండ్రులు టీకనపల్లి గ్రామానికి తిరిగి వెళ్లారు.

## పరకాల మున్సిపాలిటీలో అవినీతి అధికారి వెంకట్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

- అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
- బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్
- పరకాల మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై ఆర్డీకి పిర్యాదు
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్న ఆర్డి మసూద్



**నమస్తే హైదరాబాద్ :** పరకాల మున్సిపాలిటీలోని రికార్డు అసిస్టెంట్ ను బెదిరించి తాళాలు తీసుకొని అక్రమంగా చొరబడి,రికార్డులు మార్చి అవినీతి,అక్రమాలకు పాల్పడిన మున్సిపాలిటీ అధికారి వెంకట్ రెడ్డిని సస్పెండ్ చేసి క్రిమినల్ కేస్ నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని మున్సిపాలిటీ రీజినల్ డైరెక్టర్ షేక్ మసూద్ ను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటరెడ్డి చాలా సంవత్సరాలుగా పరకాల మున్సిపాలిటీలో పనిచేస్తూ రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో,నిబంధనలకు విరుద్ధంగా అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పరకాల మాజీ కౌన్సిలర్ తో కలిసి వెంకట్ రెడ్డి అక్రమాలకు పాల్పడిన విషయం అన్ని పత్రికలు,మీడియా ఛానల్స్ లో కూడా ప్రచురితమయ్యాయని,దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్,వివిధ ప్రజా సంఘాల నాయకులు మోరే ఐలయ్య,మంద వెంకటయ్య,పోలేపాక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అనాధలకు ఆసరా మనం స్వచ్ఛంద సంస్థ

**నమస్తే హైదరాబాద్ :** :వరంగల్ నగరంలోని అనాధ శరణాలయంలో ఉంటూ చదువుకునే విద్యార్థిని అంజలి ఉన్నత చదువులకు ఎంసెట్ శిక్షణ తీసుకోవాలని పరితపిస్తున్న తరుణంలో ఆమెలోని తపన చూసి మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ముందుకు వచ్చి అంజలికి ఎంసెట్ కోచింగ్ ఇప్పించనున్నట్లు మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోళ్ళ రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి అనాధ శరణాలయంలోనే పెరుగుతూ తెలుగు మీడియం పాఠశాలలో తన విద్యాభ్యాసం కొనసాగిస్తున్న అంజలి ఉన్నత చదువులు చదవాలని ఆశతో ఎదురుచూస్తూ ఎంసెట్ లో మంచి ర్యాంకు తెచ్చుకొని తాను ఒక డాక్టర్ కావాలనుకుంటున్నానని అంజలి తన ఆశాభావం వ్యక్తం చేయడంతో ఆమెలోని పట్టుదల చూసిన మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేరదీసి ఆమెకి ఎంసెట్ కోచింగ్ ఇప్పించడానికి ముందుకు వచ్చామన్నారు. మంగళవారం ఆమెని నగరంలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్ లో చేర్పించడం జరిగిందన్నారు. ఆమెకి విద్యతో పాటు హాస్టల్ సదుపాయానికి కూడా తాము ఫీజు చెల్లించినట్లు తెలిపారు. ఆ అమ్మాయి ఉన్నత చదువులు చదివి సమాజానికి ఉపయోగపడే ఒక మంచి డాక్టర్ గా ఎదగాలని కోరుకుంటున్నామని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆశిస్తున్నట్లు అందుకోసం మనం స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తుందన్నారు. అంజలికి సహాయం చేసినందుకు ఆమె మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు శైలేష్,దీపిక,నాగరాజు, మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోళ్ళ రాజేంద్ర ప్రసాద్,మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## జ్యోతి భా పూలే జయంతి దినంను సెలవు దినంగా ప్రకటించాలి

### పూలే జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలి

### పూలే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ



**నమస్తే హైదరాబాద్ :** మహాత్మా జ్యోతి భా పూలే జయంతి ఏప్రిల్ 11 దినంను సెలవు దినంగా ప్రకటించాలని,అదేవిదంగా పూలే జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలని పూలే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కరీంనగర్ జ్యోతి భా పూలే సంక్షేమ సంఘం కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గడప కోటేష్ కుమార్,బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఈరల్ల విజయ్ కుమార్ కురుమలతో కలిసి పూలే బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ మీడియాతో మాట్లాడారు. మహాత్మా జ్యోతి భా పూలే ఏప్రిల్ 11న 198వ జయంతి ఉత్సవాలు ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నప్పటికీ ప్రజలలో ప్రచారం లేక,సెలవు దినం కూడా లేకపోవడం వలన ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొనలేక పోతున్నారన్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రపంచ మేధావి అంబేద్కర్,పూలేను తన గురువుగా ఎంచుకున్నారంటే వారు ఎంత గొప్ప వ్యక్తో అర్థమవుతుందని గుర్తు చేశారు. పూలే దంపతులు వారి జీవితాన్నే సమాజానికి త్యాగం చేసిన మహనీయులు అని కొనియాడారు. వారి చరిత్ర మన భావితరాలకు అందించవలసిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. వారి జయంతి, వర్ధింతి సమయంలో ప్రజలకు బోధించవలసిన అవసరం ఉందన్నారు. సంఘసంస్కర్తగా ఎన్నో పాఠశాల,ముఖ్యంగా మొదటి బాలికల పాఠశాల, బాల్య వివాహాల నిర్మూలన,సతీ సహగమన నిర్మూలన,వ్యతిరేకం ఉద్యమం,వితంతువుల పెళ్లిలు,స్త్రీ విద్య కోసం,సమ సమాజ నిర్మాణానికి, గత కాలంలో చదువుకు అందరు దూరం ఉండాలనే నిబంధనలకు,ఆచారాలకు వ్యతిరేకంగా సమ సమాజ నిర్మాణానికి వారు చేసిన కృషి మాటల్లో చెప్పుకోలేనిదన్నారు. పూలే దంపతులు నాడు ఉన్న సమాజంలోని బానిసత్వాన్ని అన్ని రకాల సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు వ్యతిరేకంగా సమ సమాజానికి,సమానత్వం కోసం వారు చేసిన కృషి వల్ల నేడు మనం ఇలా జీవించగలుగుతున్నామని అన్నారు. ఈరోజు మనం కొన్ని ఫలాలనైన అనుభవిస్తున్నామంటే అది వారి కృషి వల్లనే అని తెలిపారు. పూలే జయంతి ఉత్సవాలలో సమాజంలోని అన్ని కులాలు,అన్ని మతాల వారు పాల్గొని ఘన నివాలి అర్పించి గుర్తించవలసిన అవసరం ఉందన్నారు.

## ఆ ఘటనపై విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్..

విశాఖపట్నంలో తన కాన్వాయ్ కారణంగా విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరవలేకపోయారనే వార్తలపై విచారణ చేపట్టాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కాన్వాయి కోసం ఎంతసేపు ట్రాఫిక్ ను నిలుపుదల చేశారు? పరీక్ష కేంద్రం దగ్గరకు విద్యార్థులు చేరుకోవలసిన మార్గాల్లో ఆ సమయంలో ఉన్న ట్రాఫిక్ పరిస్థితి ఏమిటి? సర్వీసు రోడ్లలో ఉన్న ట్రాఫిక్ ను ఏమైనా నియంత్రించారా? లాంటి అంశాలపై విచారించాల్సిందిగా విశాఖపట్నం పోలీసులకు స్పష్టం చేశారు. పెందుర్తి ప్రాంతంలో జె.ఈ.ఈ. పరీక్షకు కొందరు విద్యార్థులు అందుకోలేకపోవడానికి ఉప ముఖ్యమంత్రి కాన్వాయి కారణమని వచ్చిన వార్తా కథనాలను పరిగణనలోకి తీసుకొని వాస్తవ కారణాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. కాగా.. విశాఖ నగర పరిధిలోని చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నిన్న జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షకు సకాలంలో చేరుకోని నలుగురు విద్యార్థులను నిర్వాహకులు అనుమతించలేదు. ఉదయం 8.30 గంటల్లోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉండగా.. పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో తలెత్తిన ట్రాఫిక్ ఇబ్బందులతో సకాలంలో చేరుకోలేకపోయామని విద్యార్థులు చెప్పారు.

ఏ ప్రాంతంలోనూ ట్రాఫిక్ ఆపలేదు: విశాఖ ట్రాఫిక్ పోలీసులు

మరోవైపు ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్డులో ఏ ప్రాంతంలోనూ ట్రాఫిక్ ఆపలేదని విశాఖ ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ట్రాఫిక్ నిలిపివేయడం వల్లే పరీక్షకు సకాలంలో చేరుకోలేకపోయామని కొందరు అభ్యర్థులు చేసిన ఆరోపణలను పోలీసులు ఖండించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో కూడా సర్వీస్ రోడ్లలో రాకపోకలను ఆపలేదని చెబుతున్నారు పోలీసులు. అందుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పోలీసులు విడుదల చేశారు. ఇదిలాఉంటే.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఏజెన్సీ జిల్లాల్లో పర్యటిస్తోన్నారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని డుంబ్రిగూడ గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయం కల్పించడానికి 1,005 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన 1,069 కిలో మీటర్ల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## ఎండ, ఉక్కపోత.. తాజాగా వర్షం..

బుధవారం (09-03-25) అల్లూరి సీతరామరాజు జిల్లా రంపచోడవరం, ఏలూరు జిల్లా పోలవరం, వేలేరుపాడు మండలాల్లో తీవ్రవడగాలులు(3) ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. రేపు వడగాలులు(25) వీచే అవకాశం ఉన్న మండలాలు అల్లూరి సీతారామరాజు జిల్లా-6, తూర్పుగోదావరి-1, ఏలూరు-5, ఎన్టీఆర్-2, గుంటూరు-9, పల్నాడు-2 మండలాల్లో వడగాలులు (25) వీచే అవకాశం ఉందన్నారు. గురువారం 56 మండలాల్లో వడగాలులు వీచేందుకు అవకాశం ఉందన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా దొర్నిపాడు, వైఎస్సార్ జిల్లా మద్దూరులో 41.5ళీ%జ%, కర్నూలు జిల్లా కామవరం 40.7 %జ%, పల్నాడు జిల్లా రావిపాడులో 40.6ళీ%జ%, ప్రకాశం జిల్లా దరిమడుగలో 40.6ళీ%జ%, అల్లూరి సీతారామరాజు ఎర్రంపేట 40.3ళీ%జ%, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.1ళీ%జ% చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైందన్నారు. 25 ప్రాంతాల్లో 40ళీ%జ%కు పైగా ఉష్ణోగ్రతలు రికార్డైనట్లు వెల్లడించారు.

ఎండతీవ్రంగా ఉండి బయటకు వెళ్లేప్పుడు తలకు టోపి, కర్చీఫ్ కట్టుకోవాలి, గొడుగు ఉపయోగించాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకూడదని, శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులను ఎండలో చేయరాదని సూచించారు.

ఐఎండి సూచనల ప్రకారం నైరుతి మరియు దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఇది వచ్చే 24 గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత, ఇది ఉత్తర-ఈశాన్య దిశగా తిరిగి వచ్చి ఆ తదుపరి 24 గంటల్లో మధ్య బంగాళాఖాతంలో క్రమంగా బలహీనపడనున్నట్లు తెలిపారు. రేపు, ఎల్లుండి అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందన్నారు. శుక్రవారం (11తేది) ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల క్రింద నిలబడరాదన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## సినిమా



### పవన్ కుమారుడు ప్రమాదంపై స్పందించిన చిరంజీవి, చంద్రబాబు, లోకేష్, కేటీఆర్, జగన్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదంలో గాయపడ్డాడు. సింగపూర్ లో జరిగిన అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డాడు. విషయం తెలియగానే పవన్ కళ్యాణ్ సింగపూర్ కు బయలుదేరారు. పవన్ ప్రస్తుతం విశాఖ పర్యటనలో ఉన్నారు. గాయపడిన మార్క్ శంకర్ కు సింగపూర్ లో చికిత్స అందిస్తున్నారు. కాగా పవన్ కుమారుడు అగ్నిప్రమాదంలో గాయపడటం పై సినిమా ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. ఈ ఘటన పై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. 8 ఏళ్ల మార్క్ శంకర్ ప్రస్తుతం బాగానే ఉన్నాడు.. కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి అని చిరంజీవి తెలిపారు.అలాగే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. మార్క్‌శంకర్‌కు గాయాలైన విషయం ఆందోళన కలిగించింది. సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా అని చంద్రబాబు ట్వీట్ చేశారు. అలాగే నారా లోకేష్ స్పందిస్తూ..”మార్క్ శంకర్‌కు గాయాలు కావడం బాధాకరం. అగ్ని ప్రమాదం గురించి తెలుసుకుని షాక్‌కు గురయ్యా.. మార్క్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ఈ క్లిష్ట సమయంలో పవన్ కుటుంబానికి ధైర్యం చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నా అని లోకేష్ పేర్కొన్నారు.ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందిస్తూ.. “సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదం గురించి తెలిసి నేను షాక్ అయ్యాను, అందులో పవన్ కళ్యాణ్ గారి కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి ధైర్యం చేకూరాలని, ఆ చిన్నారి త్వరగా.. పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని ట్వీట్ చేశారు. పవన్ కుమారుడు ప్రమాదంపై బండి సంజయ్ స్పందించారు. “మార్క్ శంకర్‌కు గాయాలు కావడం బాధ కలిగించింది.త్వరగా కోలుకోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నా అని బండి సంజయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అదేవిధంగా ఈ ఘటన పై కేటీఆర్ స్పందిస్తూ.. మార్క్‌శంకర్ గాయపడినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందా.. ఆ చిన్నారి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



# సహజసిద్ధంగా అడవి తల్లి అందించిన వరం..!



తునికి పండు.. ఈ పండు పేరు చెప్పగానే అలాంటి పండు కూడా ఉంటుందా అని నోరేళ్ల బెట్టే వాళ్లు ఎందరో..! కానీ ఒక్కసారి రుచి చూశారా మళ్లీ మళ్లీ కావాలని కోరుకోవడం మాత్రం పక్కా.. అలా అని ఈ పండు ఏడాది పొడుగూత దొరుకుతుందనుకుంటే పొరపాటు. కేవలం వేసవిలో అదికూడా కేవలం మూడంటే మూడు వారాలు మాత్రమే దొరికే మహా ప్రసాదం లాంటి పండు అది. అడవి తల్లి అందించిన వరం ఆ పండు. చెప్పుకుంటూ పోతే ఈ పండు ప్రత్యేకతే వేరు.కేవలం నెలరోజులు (మార్చి మూడో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం చివరి వరకు) మాత్రమే లభించే ఈ పండ్ల చెట్లను ఎవరూ ప్రత్యేకంగా పెంచరు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం కూడా అరుదే. కానీ అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో మాత్రం మండు వేసవి వచ్చిందంటే చాలు ఈ పండ్లే అటు వన్య ప్రాణులకు ఇటు ఆదివాసీ గిరిజనులకు పోషకాలను అందిస్తాయి.

పండు పైభాగంలో గట్టిగా.. లోపలంతా నాజుగ్గా గుజ్జుగా ఉంటుంది. ఈ గుజ్జు రుచి అద్భుతం. అటు తీపి కాదు ఇటు వగరు కాదు అన్నట్టుగా ఉంటుంది ఈ పండు రుచి. ఆదిలాబాద్ ఏజెన్సీలో ఈ పండుకు ఎవర్ గ్రీన్ అటవీ ఆహారంగా పేరుంది. వీటి సేకరణ కూడా అంతే పద్దతిగా, ప్రత్యేకంగా ఉంటుంది. ఉదయం 6 గంటల లోపే అడవిలోకి వెళ్లి తునికి చెట్లకు పండిన ఈ తునికి పండ్లను సేకరిస్తారు గిరిజనులు. అలా లభించిన పండ్లను స్థానిక మార్కెట్ లో విక్రయిస్తారు.

తునికి పండ్లు పోషకాలు పుష్కలంగా ఉండి ఆరోగ్య పరంగా అందరికీ మేలు చేస్తాయి. పైన తోలు లోపల గుజ్జు, ఆ గుజ్జు లోపల గింజలు ఉంటాయి. అయితే లోపలి గుజ్జును మాత్రమే తింటారంతా. తింటే తీపి, వగరు రుచిలో ఉండే ఈ తునికి పండ్లలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండి, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. శరీరానికి కావాల్సిన ఖనిజ లవణాలు, వివిధ రకాల చక్కెరలు, పీచు పదార్థం కూడా ఇందులో లభిస్తుంది. కాలానుగుణంగా లభించే ఈ తునికి పండ్లను తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచే పోషకాలు కూడా ఇందులో చాలానే ఉన్నాయి.

ముఖ్యంగా ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. విటమిన్లు ఎ, సి, ఇ సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి తినడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. తునికి పండ్లు డయాబెటిస్ ఉన్నవారికి గొప్ప వరం అని చెప్తున్నారు నిపుణులు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేస్తాయంటున్నారు.

తునికి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల వయస్సు మీద పడడం, చర్మంపై ముడతలు రావడాన్ని తగ్గిస్తాయి. దీంతోపాటు స్కిన్ టోన్‌ను మెరుగు పరుస్తాయి. అలాగే సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల భారీ నుంచి సైతం చర్మాన్ని రక్షిస్తాయి. దీంతో చర్మం ఆరోగ్యంగా ఉండటంతో యవ్వనంగా కనిపిస్తారు. తునికి పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. సోడియం తక్కువగా ఉంటుంది. కనుక ఈ పండ్లను తింటే బీపీని నియంత్రించవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుందని చెప్తున్నారు వైద్యులు. ఫలితంగా హార్ట్ ఎటాక్ లేదా ఇతర గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చని చెప్తున్నారు.

ఈ తునికి పండ్లు ఆదిలాబాద్ ఆకురాల్చే అడవుల్లో విరివిగా లభిస్తాయి. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్ , జైనూర్ , తిర్యాణి, ఉట్నూర్ ప్రాంతంలో పుష్కలంగా లభిస్తున్నాయి. అయితే అడవుల నరికివేతతో తునికి, పాలచెట్లు అంతరించిపోతున్నాయి. దీంతో పోషక విలువల గనిగా పేరున్న తునికి, పాలపండ్లు విరివిగా దొరకడం లేదు. అటవీశాఖ అధికారులు కూడా ఈ వృక్షాలపై దృష్టి సారించడంలేదు. అక్కడక్కడా ఒకటో, రెండో చెట్లు ఉండగా గిరిజనులు పండ్లను సేకరించి విక్రయిస్తున్నారు.

వేసవి కాలం ఏప్రిల్, మే నెలల్లో లభించే ఈ పండ్ల కోసం పలువురు ఎదురుచూస్తుంటారు. కాగా వీటిని పక్షులు, కోతులు, ఎలుగుబంట్లు ఎక్కువగా తింటాయని గిరిజనులు చెబుతున్నారు. తునికి (టెండూ ఫ్రూట్) పండ్లు తింటే అజీర్తి, నోటి పూత సమస్యలు తగ్గుతుతాయని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా తీసుకోవచ్చని, వీటిని డ్రై ఫ్రూట్గా కూడా తీసుకోవచ్చని చెబుతున్నారు.

తునికి పండ్లలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మలబద్ధకం సమస్య ఉండదంటున్నారు వైద్యులు. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు తగ్గుతాయి. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంటారు. తునికి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షిస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. తీవ్రమైన వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఇలా తునికి పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చంటున్నారు వైద్యులు. పర్‌సిమోన్ పండ్లుగా%ా% హిందీలో అమర్ ఫల్ గా.. తెలుగులో తునికి పండ్లుగా పేరొందిన ఈ పండు. అడవి సపోటాగా గుర్తింపును పొందింది. మరెందుకు ఆలస్యం.. తునికి పండ్లను ఇప్పుడే ఇంటికి తెచ్చుకోండి. ఆరోగ్యాన్ని పెంచుకోండి.

# సింగిల్ చార్జింగ్ పై 260 కిలోమీటర్ల రేంజ్..



మన దేశంలో రాడార్ సహాయక ముందు, వెనుక డాష్ క్యామ్ లను కలిగిన మొదటి స్కూటర్ టెస్రాక్ట్. ఇది రియల్ టైమ్ రైడ్ ఫుటేజ్ ను రికార్డు చేస్తుంది. అడ్వాన్స్ డ్ రైడర్ టైమ్ అసిస్టెన్స్ సిస్టమ్ (ఏఆర్ఏఎస్) కొలిషన్ అలారాలు, లేన్ చేంజ్ అసిస్టెన్స్ తదితర ఫీచర్లు ఉన్నాయి. రైడర్ భద్రతకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. స్కూటర్ లో 20.1 హార్స్ పవర్ ఎలక్ట్రిక్ మోటారు ఏర్పాటు చేశారు. గంటకు గరిష్టంగా 125 కిలోమీటర్ల వేగంగా పరిగెడుతుంది. దీనిలోని 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ద్వారా సింగిల్ చార్జింగ్ పై సుమారు 260 కిలోమీటర్ల రేంజ్ వస్తుంది. వేగవంతమైన చార్జర్ తో గంట కంటే తక్కువ సమయంలో 80 శాతం బ్యాటరీని చార్జింగ్ చేసుకోవచ్చు.

రైడర్ భద్రతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. రాడార్, డాష్ క్యామ్ వ్యవస్థలు చాలా ఉపయోగంగా ఉంటాయి. డ్యూయల్ చానల్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ తో సురక్షితమైన ప్రయాణం చేయవచ్చు. హ్యాండిల్ బార్ లపై హాప్టిక్ ఫీడ్ బ్యాక్, బ్లైండ్ స్పాట్ హెచ్చరికలు, స్మార్ట్ మిర్రర్లు అదనపు ప్రయోజనాన్ని అందిస్తాయి. స్కూటర్ లో ఏర్పాటు చేసిన ఆధునిక ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి. దీనిలోని ఏడు అంగుళాల టీఎఫ్ టీ టచ్ స్క్రీన్ ద్వారా ఆన్ బోర్డు నావిగేషన్, స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీ పొందవచ్చు. హాప్టిక్ ఫీడ్ బ్యాక్ హ్యాండిల్ బార్లు, వైర్ లెస్ స్మార్ట్ ఫోన్ చార్జింగ్, వైలెట్ ఏఐ ఇంటిగ్రేషన్ తో ప్రయాణం చాలా సౌకర్యంగా ఉంటుంది. సెల్ ఫోన్ ను చార్జింగ్ చేసుకునే అవకాశం, అండర్ సీటు స్టోరేజీలో హెల్మెట్ ను దాచుకోవచ్చు.

వారెవ్వా అనిపించే డిజైన్ తో టెస్రాక్ట్ స్కూటర్ ఆకట్టుకుంటోంది. యుద్ధ హెలికాప్టర్ల నుంచి ప్రేరణ పొందిన షార్ప్ లేన్లు, డీఆర్ఎల్ లు, ట్విన్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ ల్యాంపులు బాగున్నాయి. స్టీల్త్ బ్లాక్, సోనిక్ పింక్, డెసర్ట్ సాండ్ తదితర రంగులతో ఆకట్టుకుంటోంది. కీలెస్ యాక్సెస్, పార్క్ అసిస్ట్, హిల్ హూల్డ్ , క్రూయిజ్ కంట్రోల్ తదితర ఫీచర్లు ఉన్నాయి.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..